## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరాకు ఆటంకం

మంగళగిరి: నగరంలోని 33 /11 కేవీ ఎస్ ఎస్–2 విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ క్యాంప్ ఫీడర్ మరమ్మతులు, నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు నిమిత్తం బుధవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ డీఈఈ అక్కల సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని ద్వారకానగర్, ఏపీఎస్పీ క్యాంప్ రోడ్, ఎల్బీ నగర్, ఇందిరానగర్, గణపతినగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, కావున ఆయా ప్రాంతాల ప్రజలు ఈ విషయాన్ని గమనించి విద్యుత్‌శాఖకు సహకరించాలని కోరారు.

### ప్రజలకు సత్వర సేవలు అందించాలి

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని రేషన్ డీలర్లు, వాహన ఎండీయూలకు సమావేశం నిర్వహించారు. డీటీ అనిల్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు, ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే వాహన ఎండీయూలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు సత్వర సేవలు అందించాలని కోరారు. రేషన్ కాటాలు, మిషన్‌లు మరమ్మతులు ఉంటే వాటిని వెంటనే చేయించుకోవాలని చెప్పారు. సమావేశంలో తహసీల్దార్ పద్మనాభుడు, రెవెన్యూ సిబ్బంది, పలుగ్రామాల రేషన్ డీలర్లు, వాహన ఎండీయూలు పాల్గొన్నారు.

### బీజేపీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

మంగళగిరి: హిందూ దేవాలయాల్లో అన్య మతస్తులను, అవినీతిపరులను తొలగించాలని, తిరుమల తిరుపతి దేవస్థాన పాలక మండలి రద్దు చేసి హిందూ సంప్రదాయాలను కాపాడే వారిని దేవస్థాన కమిటీ పాలక మండలి సభ్యులుగా నియమించాలని కోరుతూ మంగళవారం బీజేపీ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు తుల్లిమిల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు జగ్గారపు శ్రీనివాసరావు, కోవెలకారు రాకేష్, అందె శివశంకరరావు, తుల్లిమిల్లి శ్రీనివాసరావు, కొక్కిరాల యశోదకృష్ణ, కాండ్రు భానుకిషోర్, మొండి వీరవాబు, ఉద్దంటి లెనిన్ తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటించాలి



ఫిరంగిపురం: గర్భిణులు తగిన జాగ్రత్తలు పాటించడం ద్వారానే వర్షాకాలంలో రోగాల బారి నుంచి బయటపడి ఆరోగ్యంగా ఉండవచ్చని వైద్యాధికారి ఫరీనాబేగం అన్నారు. మండలంలోని గుండాలపాడు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా నుదురుపాడు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, 104 వాహన సిబ్బందితో కలిసి మంగళవారం వైద్య శిబిరం నిర్వహించారు. 92 మందికి పలు రకాలైన షుగర్, బీపీ, థైరాయిడ్, హెబీ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి నెలకు సరిపడా మందులు అందజేశారు. వారికి తగిన సూచనలు అందజేశారు. అంగన్‌వాడీ కేంద్రాల వద్దకు వెళ్లి పిల్లల బరువు, ఎత్తు చూసి నమోదు చేశారు. శిబిరం వద్దకు రాలేని గర్భిణుల ఇళ్ల వద్దకు వెళ్లి పరీక్షలు చేసి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సంధ్య, ఏఎన్‌ఎం రోజమ్మ, ఆశా కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

### మద్యం విక్రేత అరెస్ట్

మంగళగిరి: మండలంలోని కురగల్లు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని మంగళగిరి రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... కురగల్లుకు చెందిన రావూరి ప్రభుదాస్ కొంతకాలం నుంచి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం పక్కా సమాచారం అందుకున్న రూరల్ ఎస్ఐ క్రాంతికిరణ్ తన సిబ్బందితో ఆకస్మికంగా దాడి నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అక్రమ గ్రావెల్ తవ్వకాలపై రూ.30,174 జరిమానా

తాడికొండ: తాడికొండ మండలం మోతడక గ్రామంలోని సర్వే నెంబర్ 201లోని పట్టా భూముల్లో జరుగుతున్న అక్రమ గ్రావెల్ తవ్వకాలపై విజిలెన్స్, రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించి రూ.30,174 జరిమానా విధించినట్లు మైనింగ్ అధికారులు తెలిపారు. ఘటనా స్థలంలో ఎలాంటి బిల్లులు లేకుండా తరలిస్తున్న మూడు లారీలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనుమతులు లేకుండా ప్రభుత్వ పట్టా భూముల్లో మట్టి తరలించడం నేరమని ఇకపై అలాంటివి జరిగితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# కమనీయం తెలుగు భాష

- ఘనంగా తెలుగు భాషా దినోత్సవం
- విద్యార్థులకు పోటీలు
- ఆకట్టుకున్న వేషధారణలు



చిన్నారులతో తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రామిరెడ్డి

ఫిరంగిపురం: మండలంలోని వేమవరం గ్రామంలోని ఎంపీపీ పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు. పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ రామిరెడ్డి మాట్లాడుతూ తెలుగు భాషా గొప్పతనాన్ని తెలయజేశారు. అనంతరం విద్యార్థులకు శ్రీకృష్ణదేవరాయలు, దేశనాయకుల వేషధారణ నిర్వహించారు, పద్యాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం దివి కమల్‌మోహన్, రవికుమార్,విద్యార్థులు పాల్గొన్నారు.

**నిర్మల ఫార్మసీ కళాశాలలో**

మంగళగిరి: నిర్మల ఫార్మసీ కళాశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు తెలుగు గడ్డపై సంఘ సంస్కర్తలు అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. కర్నూలు డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా ముఖ్య అతిథిగా పాల్గొని వక్తృత్వ పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఎదగాలంటే చదువుతోపాటు సర్టిఫికెట్ కోర్సులు చేయడంతోపాటు ధ్యానం ద్వారా మనస్సును ప్రశాంతంగా ఉంచుకోవడం ముఖ్యమన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ సిస్టర్ నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ డాక్టర్ అబ్దుల్ రెహ్మాన్, పిరమిడ్ ధ్యాన శిక్షకులు ఆకురాతి శంకరరావు, జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ అధికారి రేఖా నరేష్‌బాబు, కె నిహారిక, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కర్నూలు డీఎస్పీ షేక్ మహబూబ్ బాషా

## బాబుకు వ్యతిరేకంగా అమరావతి వాసుల నిరసన



ఉద్దండరాయునిపాలెం(తాడికొండ): చంద్రబాబు హయాంలో జరిగిన ఇసుక దోపిడీ ఎప్పుడూ జరగలేదని అమరావతి వాసులు మండిపడ్డారు. టీడీపీ నాయకులు ఇసుక రీచ్‌ల పరిశీలనకు పిలుపునిచ్చిన నేపథ్యంలో తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలెం గ్రామంలో ప్రజలు నిరసన తెలిపారు. చంద్రబాబు హయాంలో కృష్ణానదీ కరకట్ట పొడవునా అక్రమంగా ఇసుకను నిలువు దోపిడీ చేసినందుకు గ్రీన్ ట్రిబ్యునల్ రూ.100 కోట్ల జరిమానా విధించిందని, దానిని మరిచి నేడు ఇసుక రీచ్‌ల పరిశీలన పేరుతో టీడీపీ నాయకులు బయలుదేరడం సిగ్గుచేటన్నారు. టీడీపీ నేత ధూళిపాళ్ల నరేంద్ర సోదరుడు సురేంద్రకి అప్పజెప్పి బాబు వేల కోట్లు దండుకున్నాడని, గతంలో ఎంపీపీగా ఉన్న మండల స్థాయి నాయకురాలు ఇసుక దోపిడీ ద్వారా దాదాపు రూ.100 కోట్లు సంపాదించిందని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఇసుక రవాణా పారదర్శకంగా కొనసాగుతుందని, ఇసుక ద్వారా వచ్చిన ఆదాయాన్ని పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం వినియోగిస్తుండటంతో సంక్షేమాన్ని అడ్డుకునేందుకు బాబు వేసిన కుట్రలో భాగమే ఈ తప్పుడు ప్రచారం అన్నారు. ఇసుకను దోపిడీ ఎలా చేయాలి అనేది కనిపెట్టింది, అమలు చేసింది చంద్రబాబు నాయుడే అని పేదలకు సంక్షేమం అందడం ఇష్టం లేకనే బాబు కుట్రలకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. బాబుకు దమ్ముంటే ఇసుక దోపిడీ ఎవరి ప్రభుత్వంలో జరిగిందో డిబేట్‌కి రావాలని పలువురు అమరావతి వాసులు సవాల్ విసిరారు.

## విజయకీలాద్రిపై భూ వరాహస్వామి కల్యాణ మహోత్సవం



తాడేపల్లిరూరల్: సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై భూ వరాహ జయంతి సందర్భంగా మంగళవారం భూ వరాహస్వామి వారికి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి మంగళాశాసనసములతో త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో భూ వరాహ స్వామి వారికి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించామని, భక్తులు అధిక సంఖ్యలో ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలిపారు.

## నేడు వీరభద్రస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సం



పునః ప్రతిష్ఠా మహోత్సవానికి సిద్ధమైన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయం

తాడికొండ: తాడికొండలో సర్వాంగ సుందరంగా నిర్మించిన శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయం ప్రతిష్ఠా మహోత్సవానికి సిద్ధమైంది. ఆలయంలో స్వామి వారి జీర్ణోద్ధరణతోపాటు గణపతి, సుబ్రహ్మణ్య, (స్ఫటిక రుద్ర) శివలింగం, మేధా దక్షిణామూర్తి, వినాయక, సరస్వతి, అయ్యప్ప, ఆదిత్యాది నవగ్రహ, సూర్య, కాలభైరవ, యుగళ నాగేంద్ర, బలిపీఠ, దక్షిణామూర్తి, దత్తాత్రేయ, చతుర్ముఖ బ్రహ్మ, లింగోద్భవ మూర్తి, విష్ణు, చండీశ్వర, మహాలక్ష్మీ దుర్గా, శిఖర, ద్వారపాలక పరివార దేవతా యంత్ర, జంబ ప్రతిష్ఠ నిర్వహించనున్నారు. మల్లంపల్లి వంశస్తుల ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా బుధవారం సుముహూర్తానికి బింబ ప్రతిష్ఠ, మహా మంగళ పూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాణం, ఆశీర్వచనం, అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న న్యాయ పరివేక్షణాధికారి వాసంతి,

కొల్లిపర: బాల్య వివాహాలు నిర్వహించడం చట్టపరంగా నేరం అని ఎంపీపీ భీమవరపు పద్మావతి అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై మండల స్థాయిలో అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. సమావేశంలో బాల్య వివాహాలపై పలు అంశాల గురించి అవగాహన కల్పించడానికి జిల్లా బాలల పరిరక్షణ విభాగం నుంచి టి.దుర్గాభవాని, ఐసీడీఎస్ ప్రాజెక్టు తెనాలి చైల్డ్ డిపార్టిమెంట్ అధికారి ఎం.సునిట్, న్యాయ పరివేక్షణాధికారి వి.వాసంతి, పాల్గొన్ని మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాల్య వివాహ నిషేధిత చట్టం 2006 గురించి పూర్తిగా తెలుసుకుని దానిలోని పలు అంశాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. మండలంలో ఏ గ్రామంలోనైనా బాల్య వివాహాలు జరుగుతుంటే ప్రజలు, అధికారులు వెంటనే స్పందించి పోలీసులకు లేదా ఉన్నత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఎఫ్ సంస్థ కోఆర్డినేటర్ కె.సమర్‌కుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, మహిళ సంరక్షణ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్స్‌లు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు



ఓటర్ల జాబితాను స్వయంగా పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: ఫారం–7, వ్యక్తిగత ఆధారాలు, సూపర్వైజరీ అధికారులు నేరుగా పరిశీలన చేసిన తర్వాతనే ఓటు తొలగింపు చేపట్టాలని, ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని నగర కమిషనర్ కీర్తి చేకూరి స్పష్టం చేశారు. పొన్నూరు రోడ్, అలీ నగర్, సంగడిగుంట తదితర ప్రాంతాల్లో ఓటరు సర్వేను పరిశీలించారు. స్థానిక ప్రజలతో నేరుగా మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నగరంలో ఇంటింటి ఓటరు సర్వే పూర్తి అయిందన్నారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణలో భాగంగా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చనిపోయిన ఓటర్ల తొలగింపు, బదిలీ ఓట్లు, ద్వంద ఓట్లు తొలగింపు, నూతన ఓటర్ల నమోదు వివరాలను బీఎల్‌ఓలు క్షేత్రస్థాయి పరిశీలించి, అర్జీలు తీసుకున్న తర్వాత సూపర్వైజరీ అధికారులు నేరుగా తనిఖీ చేసి సిఫార్స్ చేయాలని ఆదేశించారు. తొలగించిన ఓట్లకు ఫారం–7 తీసుకోవాలని, చనిపోయిన వారికి సంబంధించి డెత్ సర్టిఫికెట్లు తీసుకోవాలన్నారు.

డూప్లికేట్ ఓట్లను వారి అనుమతితోనే ఒక చోట ఉంచి, మరో చోట తొలగించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డెప్యూటీ కమిషనర్ బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్(ఏఈఆర్‌ఓ) ప్రదీప్ కుమార్, సూపర్వైజరీ అధికారులు అయేషా వలి, బాలాజీ బాషా, ఎల్.నాగేశ్వరరావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఒకటిన మహంకాళీ ఆలయంలో శ్రావణ లక్ష్మీ వ్రతం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసి ఉన్న మహంకాళి అమ్మవారి దేవస్థాన ఆధ్వర్యంలో శ్రావణమాసం సందర్భంగా శ్రావణ లక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చినవెంకటరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శ్రావణమాసం సందర్భంగా సెప్టెంబర్ 1వ తేదీ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు అమ్మవారికి ఓంకార జెండా అవిష్కరించబడునని, అనంతరం వేదమంత్రాలతో పూర్ణ కలశముతో, సన్నాయి మేళాలతో అమ్మవారికి శ్రావణ లక్ష్మీ వ్రతం నిర్వహిస్తామని, కార్యక్రమంలో పాల్గొనే దంపతులు రూ.1116 చెల్లించి రశీదు పొందగలరని అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందని, ఆసక్తిగల భక్తులు శ్రావణ లక్ష్మీ వ్రతంలో పాల్గొని అమ్మవారి కృపకు ప్రాతులు కాగలరని, ఆలయ అభివృద్ధికి, అన్నప్రసాదానికి వస్తు, ధన రూపేణా విరాళాలు ఇచ్చి ఆలయ అభివృద్ధికి తోడ్పడాలని ఆయన కోరారు.

### సీపీఎం ఆధ్వర్యంలో సమరభేరి ప్రచారం

మంగళగిరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ బుధ, గురు వారాలలో నగరంలో సీపీఎం సమరభేరి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి వై కమలాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం తొమ్మిది గంటలకు ఒకటో వార్డులోని సీపీఎం కార్యాలయం నుంచి ప్రచార కార్యక్రమం ప్రారంభమవుతుందని, ఈ కార్యక్రమంలో సీపీఎం కార్యకర్తలు, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

**సీపీఎం ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ**

తాడేపల్లిరూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో సీపీఎం నాయకులు మంగళవారం కరపత్రాలు పంపిణీ చేశారు. మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఈనెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు వివిధ రూపాల్లో ఆందోళనలకు సీపీఎం పిలుపునిచ్చిందని ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎం.కోటేశ్వరరావు, డి.నాగేశ్వరరావు, కె.ప్రభాకరరావు, జి.బాలచంద్రుడు, జి.నరసింహారావు, బి.రాజు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వేకు ముందే సమస్యల పరిష్కారం

**డివిజన్ స్థాయి సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి**




సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న రాజకుమారి

తెనాలి: భూముల రీసర్వేలో ముందుగానే సమస్యలను గుర్తించి, పరిష్కరించుకుంటే మంచి ఫలితాలు వస్తాయని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకం 'మీ భూమి–మా హామీ' పై మంగళవారం స్థానిక తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో డివిజన్‌స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. డివిజనులోని మండల తహసీల్దార్లు, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో జేసీ మాట్లాడారు. సర్వే చట్టం ప్రకారం ప్రతి యాభై ఏళ్లకోసారి భూముల రీసర్వే జరగాల్సి ఉందని, వందేళ్లయినా రాష్ట్రంలో రీసర్వే జరగని కారణంగా ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్టు చెప్పారు. రీసర్వేతో భూవివాదాలకు ఆస్కారం ఉండదన్నారు. ప్రస్తుతం డివిజనులో దుగ్గిరాల, తెనాలి మండలాల్లో సర్వే జరుగుతోందని గుర్తుచేశారు. కొత్తగా పొన్నూరు, కాకుమాను మండలాల్లోనూ చేపడుతున్నట్టు తెలిపారు. రీసర్వే చేసే క్రమంలో కొన్ని పొరపాట్లు జరుగుతున్నందున, సర్వేకు ముందే వీటిని పరిష్కరించాలని రాజకుమారి చెప్పారు. ముందుగానే క్షేత్రస్థాయికి వెళ్లి సంబంధిత రైతులతో మ్యూటేషన్ పెట్టించాలని సూచించారు. అప్పటికే భూమిని అమ్మినట్టయితే సంబంధిత కొన్న రైతుతో చేయించాలన్నారు. భూమి యజమాని చనిపోతే, వారి లీగల్‌హైర్‌తో పెట్టాంచాలని చెప్పారు. ప్రభుత్వ భూములుంటే వాటి స్వభావాన్ని సర్వేకు ముందే సరిదిద్దాలని చెప్పారు. డెల్టా ప్రాంతంలో ఎక్కువగా కౌలు రైతులు క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలను, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. డెల్టా ప్రాంతంలో కౌలురైతులు అధికంగా ఉన్నందున వారికి ప్రభుత్వ ప్రయోజనాలు దక్కాటానికి అందరికీ కౌలురైతు గుర్తింపు కార్డులు వచ్చేలా చూడాలని కోరారు. రైతుభరోసా, పీఎం కిసాన్ పథకాల లబ్ధిదారులకు ఆధార్ కార్డు లింక్ కానందున, లబ్ధి చేకూరలేదని గుర్తుచేశారు. వెంటనే పూర్తిచేయించాలని ఆదేశించారు. అసైన్డ్ భూముల లబ్ధిదారులను విచారించి తగిన రికార్డును సిద్ధంచేయాలని చెప్పారు. క్షేత్రస్థాయి సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకుని, పరిష్కార మార్గాలను తెలియజేశారు.

### రూ.80 లక్షలతో నవజాత శిశు సంరక్షణ కేంద్రం అభివృద్ధి



గుంటూరు మెడికల్: జీజీహెచ్ చిన్నపిల్లల వైద్య విభాగం, నవ జాత శిశు చికిత్స, సంరక్షణ కేంద్రాన్ని రూ.80 లక్షలతో అభివృద్ధి చేస్తున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. మంగళవారం పిల్లల వార్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నవ జాత శిశు సంరక్షణ కేంద్రంలో ప్రస్తుతం 20 పడకలు ఉన్నాయని చెప్పారు. వీటికి అదనంగా మరో 20 పడకలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. మరో పది రోజుల్లో నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. కొంతమంది బయోమెట్రిక్, ఎఫ్ ఆర్ ఎస్ కుడా సరిగా వేయడం లేదన్న విమర్శలు రాకుండా చూడాలని సివిల్ సర్జన్ ఆర్ఎంఓకు ఆదేశించారు. సూపరింటెండెంట్ వెంట సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, పీడియాట్రిక్ వైద్యులు రమేష్, మోహన్ చంద్ర, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని ఉన్నారు.

## చదువుతోపాటు క్రీడలు ముఖ్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయులు పి.చంద్రశేఖర్

మంగళగిరి: కార్పొరేషన్ పరిధిలోని ఆత్మకూరులో ఉన్న నిర్మల పాఠశాలలో మంగళవారం జాతీయ ఆటల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వాలీబాల్, ఖోఖో, చెస్, షటిల్, బ్యాడ్మింటన్, స్కేటింగ్, కరాటే, కర్రసాము వంటి క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రధానోపాధ్యాయురాలు రెవ సిస్టర్ జ్ఞానసుందరి మాట్లాడుతూ విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమన్నారు. ఆటల ద్వారా విద్యార్థులు మానసిక ఒత్తిడిని తట్టుకుని మంచి ఫలితాలను సాధిస్తారని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

**ఘనంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలు**

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు పి.చంద్రశేఖర్ ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన వివిధ రకాల ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పీడీ దాసరి సుజాత, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## బస్సు కండక్టర్ కుమార్తెకు డాక్టరేట్



గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న జ్యోతి

ఫిరంగిపురం: మండలంలోని 113తాళ్లూరు గ్రామానికి చెందిన ఆర్టీసీ రిటైర్డ్ కండక్టర్ యల్లమంద కుమార్తె చుక్కా జ్యోతికి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. మహిళా స్వయం సహాయక బృందాల అభివృద్ధిలో మాస్ కమ్యూనికేషన్ పాత్రపై ప్రొఫెసర్ ఎస్.శ్యామ్యూల్ పర్యవేక్షణలో జ్యోతి పీహెచ్‌డీ చేసింది. మంగళవారం నిర్వహించిన యూనివర్సిటీ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా జ్యోతి డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. జ్యోతి తల్లిదండ్రులు, వైఎస్సార్ కాంగ్రెస్ నాయకుడు సీహెచ్ రామమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు నాగవేణి, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలో పాఠశాల విద్యను అభ్యసించిన జ్యోతి, గుంటూరులో సెయింట్ జోసఫ్ కళాశాలలో ఇంటర్, ఉమెన్స్ కళాశాలలో పోస్ట్ గ్రాడ్యుయేషన్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తి చేసింది,

## చిరువ్యాపారులకు టిఫిన్‌బండ్లు అందజేత



చిరువ్యాపారులకు టిఫిన్ బండ్లు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

మంగళగిరి: నగరానికి చెందిన పలువురు చిరువ్యాపారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) ఆర్థిక సహకారంతో టిఫిన్ బండ్లను అందజేశారు. నగరానికి చెందిన కేశనశెట్టి నాగేశ్వరరావు, షేక్ షాబిరా, షేక్ కరిమున్నీసా, గోరంట్ల శివశంకరరావులకు మంగళవారం నగరంలోని తన కార్యాలయం వద్ద స్థానిక పార్టీ నాయకుల చేతుల మీదుగా టిఫిన్ బండ్లను అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మునగాల మల్లేశ్వరరావు, ఎండీ ఫిరోజ్, ఆకురాతి రాజేష్, సాలి ప్రశాంత్, షఫీ, మహిళా నాయకురాలు సంకె సునీత తదితరులు పాల్గొన్నారు.

**అంత్యక్రియలకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం**

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెదపాలెంలో గుండెపోటుతో మృతి చెందిన కొండూరు ఝాన్సీ అంత్యక్రియల నిమిత్తం ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి రూ.10వేలు ఆర్థిక సాయాన్ని ప్రకటించి జేసీఎస్ కన్వీనర్ శృంగారపాటి రత్నం, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా మంగళవారం ఆమె కుటుంబసభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో చిలకా తిమోతి, రాజేశ్వరరావు, శ్రీను,జక్రయ్య, ప్రసాద్, బల్లరామయ్య పాల్గొన్నారు.

## మత విద్వేషాలు రెచ్చగొట్టడం తగదు




మాట్లాడుతున్న జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు

మంగళగిరి: విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయురాలు మతవిద్వేషాలు రెచ్చగొట్టడం తగదని జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు అన్నారు. నగరంలోని జమాఅతె ఇస్లామీ హింద్ కార్యాలయంలో మంగళవారం జరిగిన జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధుల సమావేశం జరిగింది. ముజఫర్‌నగర్ నేహా పబ్లిక్ స్కూల్‌లో త్రిప్తాత్యాగి అనే ఉపాధ్యాయురాలు రెండో తరగతి ముస్లిం విద్యార్థి హోం వర్క్ చేయలేదనే నెపంతో తోటి హిందూ విద్యార్థులతో మతం పేరిట విద్వేషాన్ని రెచ్చగొడుతూ ముస్లిం బాలుడిని కొట్టించిన విషయం విదితమే. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయురాలు ఇటువంటి మత విద్వేషాలు రెచ్చగొడుతూ సమాజంలో అల్లర్లకు కారణమవుతున్నారని తెలిపారు. ఇటువంటి విద్వేషాల వల్ల భవిష్యత్తులో శాంతికి విఘాతం కలిగే ప్రమాదం ఉన్నందున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు మహ్మద్ యూసఫ్, అబ్దుల్ అలీఖుమ్, సైదావలి, బాబావలి, అబ్దుల్ రషీద్, ఎస్ఎం బాషా, ఎహెచ్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.